## ఆ వ్యక్తే మమ్మల్ని విడగొట్టాడు..
### ఇసుక సొసైటీ సభ్యుల ఆరోపణ


సమావేశంలో మాట్లాడుతున్న సమ్మక్క-సారక్క ఇసుక సొసైటీ సభ్యులు

మణుగూరు టౌన్, ఏప్రిల్ 7: ఎన్నో ఏళ్లుగా కలిసికట్టుగా పని చేసుకుంటున్న తమ మధ్య ఓ వ్యక్తి చిచ్చుపెట్టి రెండువర్గాలుగా విడగొట్టి గొడవలు సృష్టిస్తున్నాడని చిన్న రాయిగూడేనికి చెందిన సమ్మక్క సారక్క ఇసుక సొసైటీ సభ్యులు ఆరోపించారు. సోమవారం మణుగూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ మణుగూరు మండలంలోని చిన్నరాయిగూడెం ఇసుక ర్యాంపులో ఓ కాంట్రాక్టర్ వద్ద సొసైటీ సభ్యులంతా కలిసికట్టుగా పనిచేస్తుంటే రమేష్ అనే వ్యక్తి వచ్చి కొంతమందికి మాయమాటలు చెప్పి విడగొట్టారని తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే, కలెక్టర్, అధికారులు కలగజేసుకొని మా మధ్య సఖ్యత కుదర్చాలని కోరారు. సొసైటీ సభ్యులు కుంజా లక్ష్మి, వెంకటరమణ, శ్యామల, మహేశ్వరి, కుంజా ఆదిలక్ష్మి, పాయం నాగమ్మ, మడకం రత్నం, కుంజా నానమ్మ, కమల, రమణ తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ


భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే పాయం

ఆళ్ళపల్లి, ఏప్రిల్ 7: మండల పరిధిలోని రాయిపాడు గ్రామంలో పైలెట్ ప్రాజెక్టు ద్వారా మంజూరైన ఇందిరమ్మ ఇళ్లకు సోమవారం పినపాక శాసన సభ్యులు పాయం వెంకటేశ్వర్లు భూమి పూజ చేశారు. అనంతోగు గ్రామంలో రేషన్ షాపులో లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణీ చేశారు. అనంతరం 13 మంది లబ్ధిదారులకు సీఎం సహాయనిధి చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పాయం రాంనర్సయ్య, మాజీ ఎంపీపీలు పడిగ సమ్మయ్య, పాపారావు, కో-ప్రచార కమిటీ అధ్యక్షుడు వాసం శ్రీకాంత్, నాయకులు అతహర్, వెంకన్న, సత్యనారాయణ, సునీత, సుధాకర్, పర్వీన్, భరత్, రవి, రాము, శ్రీను, సూరయ్య, వీరభద్రాచారి పాల్గొన్నారు.

## టీఎన్‌టీయూసీ మిత్రపక్షానికి గుర్తింపు పత్రం అందజేత



గుర్తింపు పత్రం అందిస్తున్న ఐటీసీ యూనిట్ హెడ్, హెచ్ఆర్ హెడ్

బూర్గంపహాడ్, ఏప్రిల్ 7: జనవరి 31న సారపాక ఐటీసీ పీఎస్‌పీడీలో జరిగిన గుర్తింపు కార్మిక సంఘ ఎన్నికల్లో మంచిని గుర్తించి రెండవ సారి టీఎన్‌టీయూసీ మిత్రపక్షాలను గెలిపించిన విషయం పాఠకులకు విధితమే. సోమవారం తొలి విడతలో 12 మందితో కార్యవర్గం ఏర్పాటు చేసుకుని ఐటీసీ యాజమాన్యానికి పత్రాన్ని సమర్పించారు. అయితే ఐటీసీ యూనిట్ హెడ్ శైలేంద్రసింగ్, హెచ్ఆర్ హెడ్ శ్యాంకిరణ్ చేతులమీదుగా గుర్తింపు పత్రాన్ని టీఎన్‌టీయూసీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కనకమేడల హరిప్రసాద్, గాదె రామకోటిరెడ్డికి అందజేశారు. అనంతరం నూతన కార్యవర్గానికి టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోటు రంగారావు ప్రమాణస్వీకారం చేయించారు. కార్యక్రమంలో గల్లా నాగభూషయ్య, చావా మహేశ్వరరావు, కూరపాటి శ్రీనివాసరావు, రత్నారెడ్డి, తాళ్లూరి జగదీశ్వరరావు, కాకర్ల సత్యనారాయణ, దుగ్గెంపూడి శేషురెడ్డి, అజీజ్ పాల్గొన్నారు.

## తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో బ్రిలియంట్ విద్యార్థి


విద్యార్థి నిఖిల్‌ను అభినందిస్తున్న బీఎస్ఆర్

బూర్గంపహాడ్, ఏప్రిల్ 7: కరాటే పోటీల్లో గెలుపొంది తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో సారపాక బ్రిలియంట్ పాఠశాలకు చెందిన నిఖిల్ ప్రతిభ కనబర్చాడు. తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ చీఫ్ అడ్వైజర్ టీవీ.అశోక్ కుమార్, మార్షల్ ఆర్ట్స్ మాస్టర్ ఎండి.యాకూబ్ పాషా ఆధ్వర్యంలో వరంగల్‌లో నిర్వహించిన కరాటే పోటీల్లో మొదటి స్థానంలో గెలుపొందడంతో నిఖిల్ తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించడంతో విద్యార్థిని బ్రిలియంట్ విద్యాసంస్థల అధినేత బీఎస్ఆర్ అభినందించారు. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు నిఖిల్‌ను అభినందించారు.

## అందరూ సోదరభావంతో మెలగాలి


మజ్జిగ, వాటర్‌బాటిల్స్ పంపిణీ చేస్తున్న అహ్మద్

భద్రాచలం, ఏప్రిల్ 7: మత సామరస్యానికి మన దేశం ప్రతీకగా నిలుస్తుందని, ఒకరి మతాన్ని మరొకరు గౌరవిస్తూ పండుగలను కలిసికట్టుగా జరుపుకోవడం భారతీయ సంస్కృతిలో భాగమని నేతాజీ యువజన సంఘం జనతా ఫౌండేషన్ వ్యవస్థాపకులు ఎస్‌జేకే.అహ్మద్ అన్నారు. సోమవారం భద్రాచలం సీతారామచంద్రస్వామి ఆలయంలో పట్టాభిషేకం సందర్భంగా భక్తులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మజ్జిగ ప్యాకెట్లు, వాటర్‌బాటిళ్లు, పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు.

## పాలిసెట్ ఉచిత శిక్షణ

కొత్తగూడెం సింగరేణి, ఏప్రిల్ 7: టీఎస్ పాలిసెట్ ఉచిత శిక్షణ తరగతులను సింగరేణి పాఠశాలలో ఈ నెల 10 నుంచి మే 10 వరకు నిర్వహించనున్నట్లు సింగరేణి కాలరీస్ ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యదర్శి గుండా శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. సింగరేణి పాఠశాలలో పదోతరగతి పూర్తి చేసిన విద్యార్థులు, ఇతర పాఠశాలల్లో చదువుతున్న సింగరేణి ఉద్యోగుల పిల్లలు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు. ఇతర నిరుపేద విద్యార్థులకు కూడా అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు సింగరేణి పాఠశాల హెచ్ఎంను సంప్రదించవచ్చని సూచించారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

# గిరిజనులు ఆర్థికంగా ఎదగాలి

### ట్రైబల్ మ్యూజియం ప్రారంభోత్సవంలో రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ


ట్రైబల్ మ్యూజియాన్ని ప్రారంభిస్తున్న రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

భద్రాచలం, ఏప్రిల్ 7: ప్రభుత్వం ఐటీడీఏ ద్వారా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను గిరిజనులు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని, వారిని మరింతగా అభివృద్ధి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉన్నదని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. భద్రాచలం పట్టణంలో ఏర్పాటు చేసిన ట్రైబల్ మ్యూజియాన్ని సోమవారం ప్రారంభించిన గవర్నర్.. మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యేలతో కలిసి పరిశీలించారు. మ్యూజియంలో గిరిజన సంస్కృతీ సంప్రదాయాలు ప్రతిబింబించే విధంగా ఏర్పాటు చేసిన వివిధ వస్తువులు, మట్టి ఇళ్లు, ట్రెడిషనల్ హౌస్‌లను క్షుణ్ణంగా పరిశీలించి పీవో రాహుల్‌ను ప్రత్యేకంగా అభినందించారు. దీనిని ఇంకా ఆధునీకరించాలని, గిరిజనులు తయారు చేసే కళా ఖండాలు, వస్తువులను పర్యాటకులకు విక్రయించి ఉపాధి అవకాశాలు పొందేలా చొరవ చూపాలన్నారు. అనంతరం ఆదివాసీ మహిళలు తయారు చేసిన వంటకాలను రుచిచూసి మళ్లీ భద్రాచలం వచ్చినప్పుడు తనివితీరా భోజనం చేస్తానని హామీ ఇచ్చారు. అక్కడున్న గిరిజన మహిళలు గవర్నర్‌తో ఫొటో దిగారు. కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాంనాయక్, ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు, కోరం కనకయ్య, కలెక్టర్ జితేశ్ వి పాటిల్, ఎస్పీ రోహిత్‌రాజు, పీవో రాహుల్, ఏపీవో జనరల్ డేవిడ్‌రాజ్ పాల్గొన్నారు.

### రాష్ట్ర గవర్నర్‌కు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సన్మానం

భద్రాచలం శ్రీరామ మహాపట్టాభిషేకానికి హాజరైన రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ భద్రాచలం శాఖ నిర్వాహకులు మెమొంటో అందజేసి శాలువా కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా సొసైటీ జిల్లా కోఆర్డినేటర్, ప్రోగ్రామ్ చైర్మన్ డాక్టర్ ఎస్ ఎల్.కాంతారావు గవర్నర్‌కు సొసైటీ నిర్వహిస్తున్న ఉచిత కంటి శస్త్రచికిత్సా శిబిరాల గురించి వివరించారు. వి.శ్రీనివాసరావు, వై.సూర్యనారాయణ, జి.రాజారెడ్డి, గాలిబ్, సంజీవరావు, ఆదినారాయణ పాల్గొన్నారు.

### గవర్నర్‌కు ఘన స్వాగతం

బూర్గంపహాడ్, ఏప్రిల్ 7: భద్రాచలంలో సోమవారం జరిగిన శ్రీరామ మహాపట్టాభిషేకానికి రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ సారపాకలో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్ వద్ద హెలీకాప్టర్‌లో దిగారు. గవర్నర్‌కు రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్పీ రోహిత్‌రాజ్ పుష్పగుచ్ఛాలు అందించి ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆయన ఐటీసీ గెస్ట్‌హౌస్‌కు చేరుకుని కొద్దిసేపటికి పోలీసు గౌరవ వందనం స్వీకరించి భద్రాచలంలో జరిగే శ్రీరామ పట్టాభిషేక కార్యక్రమానికి తరలివెళ్లారు. తహసీల్దార్ ముజాహిద్, ఎంపీడీవో జమలారెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

# విద్యార్థినులను చితకబాదిన టీచర్

### గిరిజన బాలికల గురుకులం ఎదుట తల్లిదండ్రుల ఆందోళన
### ఉపాధ్యాయురాలిపై చర్య తీసుకోవాలని డిమాండ్


రామవరం గిరిజన బాలికల గురుకుల పాఠశాల ఎదుట ఆందోళన చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

కొత్తగూడెం గణేష్ టెంపుల్, ఏప్రిల్ 7: తమకు నీరసంగా ఉన్నదని తెల్లవారుజామున స్టడీ అవర్స్‌కు నిద్రలేవలేకపోయిన విద్యార్థినులను ఉపాధ్యాయురాలు చితకబాదారు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రుల గురుకుల పాఠశాల ఎదుట ఆందోళనకు దిగారు. ఈ ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రామవరం గిరిజన బాలికల గురుకుల పాఠశాలలో సోమవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. రోజువారీగా ఉపాధ్యాయురాలు స్టడీ అవర్స్ కోసం విద్యార్థినులను నిద్రలేపుతారు. ఈ క్రమంలో 21 మంది విద్యార్థినులు తమకు నీరసంగా ఉన్నదని చెప్పి నిద్ర లేవలేదు. దీంతో ఉపాధ్యాయురాలు కర్రతో సదరు విద్యార్థినులను దుర్భాషలాడుతూ చితకబాదారు. ఈ విషయం వారి తల్లిదండ్రులకు తెలియడంతో వారు మధ్యాహ్నం గురుకుల పాఠశాలకు చేరుకుని గంటన్నరపాటు ఆందోళన చేపట్టారు. ఉపాధ్యాయురాలిపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇకపై ఇలా జరగకుండా చూస్తామని తోటి ఉపాధ్యాయులు చెప్పడంతో తల్లిదండ్రులు ఆందోళన విరమించారు. దీనిపై గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌ను వివరణ కోరగా.. ఉపాధ్యాయురాలు విద్యార్థినులను కొట్టింది వాస్తవమేనని, దీనిపై పూర్తి విచారణ చేసి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# భద్రాద్రిలో 'మద్యం' దందా

### పట్టించుకోని ఎక్సైజ్ అధికారులు

భద్రాచలం, ఏప్రిల్ 7: భద్రాచలంలో మద్యం దందా సాగుతోంది. బెల్టుషాపుల్లో మద్యాన్ని అధిక ధరలకు విక్రయిస్తూ వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు. ఇంత జరుగుతున్నా భద్రాచలంలో ఎక్సైజ్ శాఖ మాత్రం ఈ మద్యం దందాపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా చోద్యం చూస్తోంది. 6, 7 తేదీల్లో మద్యం దుకాణాలు బంద్ చేయాలని కలెక్టర్ ఆంక్షలు విధించడంతో ఇదే అదునుగా భావించి వ్యాపారులు గుట్టుచప్పుడు కాకుండా మద్యాన్ని బెల్టుషాపులకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇదిలా ఉండగా ఇటీవల ఆలయ పరిసరాల్లో బెల్టుషాపుల్లో మద్యం విక్రయాలు చేస్తుండగా 'నమస్తే తెలంగాణ' కథనం ప్రచురించడంతో ఆ దుకాణాలు మూసివేశారు. పట్టణంలోని ఐటీడీఏ, కూనవరం రోడ్, చర్ల రోడ్ వైపు మాత్రం బెల్టుషాపుల్లో విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు జరుగుతున్నాయి. ఎక్సైజ్ అధికారులు స్పందించి బెల్టు దుకాణాల్లో మద్యం విక్రయాలను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

# టికెట్ లేకుండానే సెక్టార్లలోకి పోలీస్ కుటుంబాల సభ్యులు



పోలీసు ఫ్యామిలీని పంపుతూ భక్తులను అడ్డుకుంటున్న పోలీసులు

భద్రాచలం, ఏప్రిల్ 7: భద్రాచలం పుణ్యక్షేత్రంలో శ్రీరామనవమి, పట్టాభిషేకం మహోత్సవాల పర్వదినం రోజు వీఐపీలు, భక్తులకు కేటాయించిన సెక్టార్లలో డ్యూటీ పోలీసులు వారి కుటుంబ సభ్యులను అనుమతించి వారి తీరు మార్చుకోలేదు. శ్రీరామ పట్టాభిషేకం నాడు వీఐపీల తాకిడి లేకపోవడంతో పోలీసులకు చెందిన పలు కుటుంబాలను టికెట్లు లేకపోయినా సెక్టార్లలోకి అనుమతించారు. అదే సమయంలో శ్రీరామదీక్ష తీసుకున్న భక్తురాలు పోలీసులను ఎంత ప్రాధేయపడినా టికెట్ లేకుండా లోనికి అనుమతించడం కుదరని చెబుతూనే ఆ సమయంలో వచ్చిన పోలీసు కుటుంబానికి చెందిన పలువురిని సెక్టార్‌లోకి అనుమతించడం పట్ల పోలీసు తీరుపై అక్కడున్న భక్తులు అసహనం వ్యక్తం చేశారు. అక్కడే విధులు నిర్వహిస్తున్న హెల్త్ డిపార్ట్‌మెంట్ ఉద్యోగులు సైతం పోలీసులను సెక్టార్‌లోకి ఒక్కసారి అనుమతిస్తే దర్శనం చేసుకుని వస్తామని చెప్పినా ససేమిరా అంటూనే ఇలా విధులను అతిక్రమించడం పట్ల వారు సైతం మండిపడ్డారు.

## ఆటో డ్రైవర్ కుటుంబానికి ఆసరా

పర్ణశాల, ఏప్రిల్ 7: మండలంలోని చిన్నబండిరేవు గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ తంతరపల్లి శేఖర్ కొద్ది రోజుల క్రితం అనారోగ్యంతో మృతిచెందాడు. తోటి ఆటో కార్మికుడు కుటుంబాన్ని సోమవారం శ్రీసీతారామ ఆటో యూనియన్ సభ్యులు పరామర్శించారు. రూ.10 వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ అధ్యక్షుడు పానుగంటి శ్రీనివాస్ గౌడ్, పిల్లి సుబ్రహ్మణ్యం, పొడుతూరి సతీష్, పసుపులేటి రవి పాల్గొన్నారు.

## ఎరియర్స్ తక్షణమే ఇవ్వాలి



ధర్నా చేస్తున్న కార్మికులు

మణుగూరు టౌన్, ఏప్రిల్ 7: మున్సిపల్ కార్మికులకు గత 31 నెలల ఎరియర్స్ వెంటనే ఇవ్వాలని తెలంగాణ మున్సిపల్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ మండల కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం మున్సిపల్ కార్మికులు ధర్నా చేపట్టారు. నాలుగు లేబర్‌కోడ్‌లు రద్దు చేయాలని, కార్మికులందరికీ కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, జీవో 51ని సవరించాలని, బకాయి వేతనం చెల్లించి కార్మికులపై అధికారుల వేధింపులు ఆపాలని వారు డిమాండ్ చేశారు.

## శిలాఫలకం ధ్వంసానికి ఖండన

అశ్వారావుపేట, ఏప్రిల్ 7: ఎమ్మెల్యేగా మెచ్చా నాగేశ్వరరావు ఆవిష్కరించిన శంకుస్థాపన శిలాఫలకం ధ్వంసం చేయడాన్ని బీఆర్ఎస్ జిల్లా అధికార ప్రతినిధి యూఎస్ ప్రకాశ్‌రావు ఖండించారు. ఆయన సోమవారం పార్టీ సమావేశంలో మాట్లాడుతూ.. ములకలపల్లి మండలం తాళ్ళపాయి వద్ద బ్రిడ్జికి శిలాఫలకాన్ని 2023 అక్టోబర్ 5న నాటి ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు శంకుస్థాపన చేశారని, శిలాఫలాకాన్ని ఆవిష్కరించారని చెప్పారు. ఆ ఫలకాన్ని దుండగులు ధ్వంసం చేశారని చెప్పారు. ఈ దుశ్చర్యను ఖండించారు. నాయకులు మందపాటి రాజమోహన్‌రెడ్డి, సత్యవరపు సంపూర్ణ, జె.శ్రీరామ్మూర్తి, రమేష్, అమీర్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.


## ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

చర్ల, ఏప్రిల్ 7: యాసంగి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని చర్ల పీఏసీఎస్ అధ్యక్షుడు పరుచూరి రవికుమార్ సోమవారం ప్రారంభించారు. రైతులు పండించిన పంటను కొనుగోలు కేంద్రంలో విక్రయించి మద్దతు ధర, బోనస్ పొందాలని రవికుమార్ కోరారు. మండల వ్యవసాయాధికారి లావణ్య, ఏఈవోలు అఫ్రీద్, రామక్రిష్ణ, సంఘ కార్యదర్శి ఎస్డీ జిలానీ రైతులు పాల్గొన్నారు.

## సింగరేణి ఆధ్వర్యంలో 'నీటి బిందువు... జల సింధువు'

కొత్తగూడెం సింగరేణి, ఏప్రిల్ 7: సింగరేణి ప్రాంతంలో భూగర్భ జలాల అభివృద్ధికి ఈ సంస్థ యాజమాన్యం.. 'సింగరేణి నీటి బిందువు... జల సింధువు' నినాదంతో ప్రజోపయోగ కార్యక్రమాన్ని చేపట్టాలని నిర్ణయించింది. దీని అమలులో భాగంగా మైనింగ్ ప్రాంతంలో, దీని వెలుపల రెండు కిలోమీటర్ల పరిధిలో 50 మినీ చెరువులను సింగరేణి నిర్మిస్తుంది. దీనిపై సోమవారం అన్ని ఏరియాల జీఎంలతో సీఎండీ బలరాం వీడియో కాన్ఫరెన్స్‌లో సమీక్షించారు. జల వనరుల వృద్ధికి మార్గదర్శకాలను వివరించారు. డైరెక్టర్లు సత్యనారాయణరావు, ఎల్‌వీ సూర్యనారాయణ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## రామయ్య సేవలో రామ్‌కో గ్రూప్


మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న రామ్‌కో గ్రూప్ బాధ్యులు

భద్రాచలం, ఏప్రిల్ 7: 25 ఏళ్లుగా భద్రాచలం సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో జరిగే శ్రీరామనవమి, పట్టాభిషేకం కార్యక్రమాలకు రామ్‌కో సంస్థ తమ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోంది. అందులో భాగంగా ఆది, సోమవారాలు భద్రాచలంలో జరిగిన నవమి మహోత్సవాల్లో పది వేల మంది భక్తులకు మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. రానున్న కాలంలో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని సంస్థ జనరల్ మేనేజర్ షణ్ముఖరాజాహరి తెలిపారు. సేల్స్ ఆఫీసర్లు, డీలర్ చారుగుళ్ల బాలకృష్ణ పాల్గొన్నారు.

## చలివేంద్రం ప్రారంభం


చలివేంద్రం ప్రారంభిస్తున్న జడ్జి కీర్తి చంద్రికారెడ్డి

ఇల్లెందు, ఏప్రిల్ 7: ఇల్లెందు కోర్టు ఆవరణలో బార్ అసోసియేషన్ ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి దేవరపల్లి కీర్తి చంద్రికారెడ్డి సోమవారం ప్రారంభించారు. అసోసియేషన్ అధ్యక్షుడు కాంపల్లి ఉమామహేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి కీర్తి కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

## దర్గాలో శ్రీరామ నవమి వేడుకలు..!


దర్గాలో సీతారాముల పట్టాభిషేకం నిర్వహిస్తున్న వేద పండితులు

ఇల్లెందు, ఏప్రిల్ 7: మసీదులో ముస్లింలు ప్రార్థన చేయడం, గుడిలో హిందువులు పూజలు నిర్వహించడం.. సర్వ సాధారణం..! దర్గాలో వేద పండితులు నవమి వేడుక నిర్వహించడం, హిందువులతోపాటు ముస్లింలు కూడా తిలకించడం హాజరవడం.. అసాధారణం, అపూర్వం, అద్భుతం..!! ఈ అసాధారణ, అపూర్వ, అద్భుత దృశ్యావిష్కరణకు ఇల్లెందు పట్టణంలోని ఒకటవ వార్డులోగల సత్యనారాయణపురంలోని అతి పురాతనమైన నాగుల్ మీరా దర్గా షరీఫ్ వేదికగా నిలిచింది. ఇక్కడ శ్రీరామ నవమి వేడుకను వేద పండితులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. శ్రీ సీతారాముల పట్టాభిషేక మహోత్సవాన్ని కూడా సోమవారం కనువిందుగా నిర్వహించారు. మూడు రోజులపాటు జరిగిన ఈ వేడుకలకు హజరత్ కాసీమ్ దుల్హా నాగుల్ మీరా దర్గా కమిటీ మాలిక్ లక్ష్మీనారాయణ నేతృత్వం వహించారు. మొదటి రోజైన శనివారం.. సత్యనారాయణపురం గ్రామం నుంచి తలంబ్రాలు, పూలు, పండ్లు, రకరకాల పిండి పదార్థాలతో నైవేద్యాన్ని పోకల దమ్మక్క వారసుల ఆధ్వర్యంలో భక్తులు భారీ ఊరేగింపుగా దర్గాకు తీసుకొచ్చి శ్రీ సీతారాముల వారికి సమర్పించారు. రెండో రోజైన ఆదివారం.. శ్రీ సీతారాముల కల్యాణోత్సవాన్ని, మూడో రోజైన సోమవారం.. శ్రీ సీతారాముల పట్టాభిషేక మహోత్సవాన్ని వేద పండితులు కనువిందుగా నిర్వహించారు. ఈ వేడుకలను హిందువులు, ముస్లింలు తిలకించారు.

## సింగరేణి ప్రధానాస్పత్రిలో ఆరోగ్య దినోత్సవం



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ లలిత

కొత్తగూడెం సింగరేణి, ఏప్రిల్ 7: ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని సింగరేణి ప్రధాన ఆస్పత్రిలో సోమవారం సింగరేణి మెడికల్ అండ్ హెల్త్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో హెల్త్ ఆఫీసర్ డాక్టర్ లలిత నిర్వహించారు. గర్భిణులకు, ఉద్యోగులకు ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించారు. డీవైసీఎంవో నాగరాజు, మాలతి, నర్సింగ్ సూపరింటెండెంట్ మేట్రన్ శాలీ పాల్గొన్నారు.

రామవరం, ఏప్రిల్ 7: సింగరేణి కొత్తగూడెం ఏరియా జీఎం శాలెం రాజు సోమవారం తన కార్యాలయంలో ఆరోగ్య దినోత్సవాన్ని నిర్వహించారు. సింగరేణి ప్రధాన ఆస్పత్రి హెల్త్ ఆఫీసర్ లలిత, రుద్రంపూర్ డిస్పెన్సరీ డాక్టర్ పరశురాములు, నాయకులు ఎండీ రజాక్, సాగర్, సౌజన్య, ఏజీఎం రామకృష్ణ, డీజీఎం శివకేశవరావు పాల్గొన్నారు.

చుంచుపల్లి, ఏప్రిల్ 7: బాబూక్యాంప్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవ అవగాహన కార్యక్రమం జరిగింది. జిల్లా న్యాయ సేవాసంస్థ కార్యదర్శి భానుమతి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్కినేని సత్యనారాయణ, డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ నిరంజన్‌రావు, డిప్యూటీ డెమో ఫయాజుద్దీన్, హెచ్ఎం నీరజ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతిభావంతులైన విద్యార్థులకు బహుమతులు


విద్యార్థులను అభినందిస్తున్న డీఈవో

కొత్తగూడెం గణేష్ టెంపుల్, ఏప్రిల్ 7: జిల్లా స్థాయి మ్యాథ్స్, సైన్స్ క్విజ్ కార్యక్రమం సోమవారం ముగిసింది. ఇందులో ప్రతిభ చూపి విజేతలుగా నిలిచన విద్యార్థులకు బహుమతులను డీఈవో వెంకటేశ్వరచారి ప్రదానం చేశారు. జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి నాగరాజశేఖర్, జిల్లా సమ్మిళిత విద్య కో-ఆర్డినేటర్ సైదులు, ప్లానింగ్ కో-ఆర్డినేటర్ సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## రిజర్వ్ ఫారెస్ట్ సందర్శన


కనకగిరి అడవులను పరిశీలిస్తున్న కోటేశ్వరరావు


జూలూరుపాడు, ఏప్రిల్ 7: మండలంలోని సూరారం గ్రామ సమీపంలోగల కనకగిరి రిజర్వ్ ఫారెస్టును కొత్తగూడెం ఫారెస్ట్ డివిజనల్ ఆఫీసర్ కోటేశ్వరరావు సోమవారం సందర్శించారు. అనంతారం గ్రామం నుంచి నల్లబండబోడు గ్రామం వరకు రహదారికి ఇరువైపులా నాటిన మొక్కలను పరిశీలించారు. మండల ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ప్రసాదరావు, సిబ్బంది నాసూర్‌బీ, హనుమంతు, కిషన్, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

## ఆక్రమణల తొలగింపు


ఆక్రమణలను తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

అశ్వారావుపేట టౌన్, ఏప్రిల్ 7: అశ్వారావుపేట పట్టణంలోని ప్రధాన రహదారులను రెండువైపులా డ్రైనేజీలను దుకాణాదారులు ఆక్రమించి వ్యాపారులు సాగిస్తున్నారు. బస్టాండ్ రోడ్డులోని ఆక్రమణలను టౌన్ ప్లానింగ్ ఆఫీసర్(టీపీవో) వి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మున్సిపల్ సిబ్బంది సోమవారం తొలగించారు. డ్రైనేజీ అవతల వైపే వ్యాపారాలు నిర్వహించుకోవాలని దుకాణాదారులతో చెప్పారు. ముందుగా నోటీసులు ఇచ్చినప్పటికీ దుకాణాదారులు స్పందించకపోవడంతో ఆక్రమణలను తొలగించినట్లు టీపీవో చెప్పారు.

## విద్యార్థులకు విద్య.. శాశ్వత ఆస్తి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

అశ్వారావుపేట రూరల్, ఏప్రిల్ 7: విద్యార్థులకు శాశ్వతంగా నిలిచిపోయేది విద్య మాత్రమేనని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అన్నారు. మండలంలోని నారంవారిగూడెం ప్రభుత్వ పాఠశాలలో సోమవారం వార్షికోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులంతా 'విద్య' అనే శాశ్వత ఆస్తిని సంపాదించుకోవాలని కోరారు. క్రీడలు-సాంస్కృతిక పోటీల విజేతలకు, నూరు శాతం హాజరు నమోదైన-ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, ఎంఈవో ప్రసాదరావు, కాంప్లెక్స్ హెచ్ఎంలు షహీనాబేగం, వీరేశ్వరరావు, హెచ్ఎం చంద్రశేఖర్‌రావు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## కరకగూడెంలో ఉరుములు, మెరుపులతో వర్షం

కరకగూడెం, ఏప్రిల్ 7: మండల వ్యాప్తంగా సోమవారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో ఓ మోస్తారు వర్షం కురిసింది. భారీ ఈదురుగాలులతో వర్షం కురుస్తుండడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. పంటలు చేతికి అందుతున్న తరుణంలో అకాల వర్షాలపై రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు.